# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 15-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ గిరిజన వారసత్వం, సంస్కృతుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.
- ❖ భగవాన్ బిర్సా ముండా... తన జీవితాన్ని జాతికి, గిరిజనుల అభ్యున్నతికి అంకితం చేశారని కేంద్ర మంత్రి అమిత్ షా అన్నారు.
- ❖ భారత్ ను విశ్వగురువుగా తీర్చిదిద్దేందుకు నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉద్ఘాటించారు.
- ❖ భారత్ గ్రిడ్ ద్వారా నేపాల్ నుండి బంగ్లాదేశ్‌కు విద్యుత్ ను సరఫరా చేసే త్రైపాక్షిక ప్రాజెక్టును ఈరోజు కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ప్రారంభించారు.

==============================

గిరిజన వర్గాల వారసత్వం, సంస్కృతిని పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. “జన్ జాతీయ గౌరవ్ దివస్” సందర్భంగా ప్రధానమంత్రి ఈరోజు 6 వేల 600 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను కూడా ఆయన ప్రారంభించారు. “పీఎం జన్‌మన్” కార్యక్రమంలో భాగంగా నిర్మించిన 11 వేల ఇళ్ల గృహ ప్రవేశాలకు ప్రధానమంత్రి... వర్చువల్ విధానంలో హాజరయ్యారు. బిర్సా ముండా వారసుడు బద్రామ్ ముండా, అమరవీరుడు సిద్ధో కన్హు కుటుంబ సభ్యుడు మండల్ ముర్ములను ప్రధానమంత్రి సత్కరించారు. జముయిలో జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి మాట్లాడుతూ.... ఆరోగ్యం, విద్య, తదితర రంగాల్లో వివిధ సంక్షేమ పథకాల ద్వారా గిరిజన సంఘాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చామన్నారు. గిరిజనుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాలను ఆకాంక్ష జిల్లాలుగా మార్చామని నరేంద్ర మోదీ పేర్కొంటూ....

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత స్వాతంత్ర్య ఉద్యమం గొప్ప నాయకుల్లో భగవాన్ బిర్సా ముండా ఒకరని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. జన్ జాతీయ గౌరవ్ దివస్ సందర్భంగా న్యూఢిల్లీ లోని బాన్సేరా పార్క్‌లో బిర్సా ముండా విగ్రహాన్ని ఈరోజు ఆయన ఆవిష్కరించారు. భగవాన్ బిర్సా ముండాకు నివాళులర్పించిన ఆయన, యువత ఆయన స్ఫూర్తితో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గిరిజన సంఘాలు బిర్సా ముండా పట్ల ఎన్నటికీ కృతజ్ఞతతో ఉంటాయన్నారు. చిన్న వయసులోనే ఆయన తన జీవితాన్ని జాతికి, గిరిజనుల అభ్యున్నతికి అంకితం చేశారని తెలిపారు. గిరిజన సంఘాలకు జల్, జమీన్, జంగిల్ చాలా అవసరమని పేర్కొంటూ... బిర్సా ముండా దీనిపై గిరిజనులను చైతన్యపరిచారన్నారు.

(వాయిస్ 33 సెకన్లు)

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, గిరిజనుల అభ్యున్నతికి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేసిందని అమిత్ షా అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ గ్రిడ్ ద్వారా నేపాల్ నుండి బంగ్లాదేశ్‌కు 40 మెగా వాట్ల విద్యుత్ ను సరఫరా చేసేందుకు ఉద్దేశించిన మొట్టమొదటి త్రైపాక్షిక విద్యుత్ ప్రాజెక్టు ఈరోజు ప్రారంభమైంది. కేంద్ర విద్యుత్ శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్... బంగ్లాదేశ్ విద్యుత్ మంత్రిత్వ శాఖ సలహాదారు ఫౌజుల్ కబీర్ ఖాన్, నేపాల్ ఇంధనం, జలవనరులు, నీటిపారుదల శాఖ మంత్రి దీపక్ ఖడ్కాలతో కలిసి వర్చువల్ గా ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సంవత్సరం అక్టోబర్ 3వ తేదీన NTPC విద్యుత్ వ్యాపార నిగమ్, నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ, బంగ్లాదేశ్ పవర్ డెవలప్‌మెంట్ బోర్డ్ ల మధ్య త్రైపాక్షిక విద్యుత్ విక్రయ ఒప్పందంపై ఖాట్మండులో సంతకాలు జరిగాయి. ఈ చారిత్రాత్మక సందర్భం భారతీయ గ్రిడ్ ద్వారా జరిగిన మొదటి త్రైపాక్షిక విద్యుత్ లావాదేవీని సూచిస్తుందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జీరో - ఎర్రర్ ప్రవేశ పరీక్షల విధానానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. ఈ ఉదయం ఆయన హైదరాబాద్‌లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) నిర్వహించిన రెండవ ఇన్‌సైట్స్ ఫోరమ్ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడారు. డాక్టర్ రాధాకృష్ణ కమిటీ సిఫార్సు మేరకు వివిధ సంస్కరణలు పరిశీలనలో ఉన్నాయని, వాటిని పరిశీలించాల్సిందిగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ఆదేశించామని చెప్పారు. కేంద్ర మంత్రి తొలుత ISB ప్రాంగణంలో ISB ఇన్‌సైట్స్ ఫోరమ్ రెండవ ఎడిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దేందుకు, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశ లక్ష్యాన్ని సాధించేందుకు... నూతన జాతీయ విద్యా విధానాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని ఉద్ఘాటించారు.

(వాయిస్ 16 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ లోని ఆస్ట్రేలియన్ హై కమిషనర్, ఫిలిప్ గ్రీన్... వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ దేవేష్ చతుర్వేదితో ఈరోజు న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి, వ్యవసాయం, అనుబంధ రంగాలలో సహకారానికి ఈ సమావేశం కీలకమైందని ఆ శాఖ పేర్కొంది. అగ్రి-టెక్, హార్టికల్చర్, డిజిటల్ అగ్రికల్చర్, వ్యవసాయ యంత్రాలతో సహా వివిధ రంగాలలో పరస్పర సహకారానికి ఇరు పక్షాలు అంగీకరించాయి. ఈ సందర్భంగా వ్యవసాయంలో భారత్ ప్రాధాన్యతలను డాక్టర్ చతుర్వేది వివరించారు. ఆహార భద్రత,

రైతుల ఆదాయం పెంపుదల, పోషకాహార భద్రత మొదలైన అంశాల్లో ప్రభుత్వ నిబద్ధతను స్పష్టం చేశారు. అలాగే... ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడం ఆవశ్యకమని ఆస్ట్రేలియన్ హై కమీషనర్ ఉద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న మూడు ఆర్థిక సంవత్సరాల్లో భారత్ GDP ప్రతి సంవత్సరం 6.5 నుండి 7 శాతం మధ్య పెరుగుతుందని S & P గ్లోబల్ రేటింగ్స్ ఏజెన్సీ తన తాజా గ్లోబల్ బ్యాంక్ ఔట్‌లుక్ నివేదికలో అంచనా వేసింది. నిర్మాణాత్మక మెరుగుదల, మంచి ఆర్థిక అవకాశాలు భారతదేశ ఆర్థిక సంస్థల అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొంది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెరిగిన వినియోగం కారణంగా భారత్ జీడీపీ 2027 వరకు ఈ విధంగా పెరుగుతుందని వివరించింది. బలమైన బ్యాంక్ క్యాపిటలైజేషన్‌తో పాటు అధిక డిమాండ్ కూడా బ్యాంకు రుణ వృద్ధిని పెంచుతుందని ఏజెన్సీ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఒడిషా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ.. బలి జాత్ర ఉత్సవాలను ఈ రోజు ప్రారంభించారు. ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజున ఈ ఉత్సవం ప్రారంభమవుతుంది. ఇది ఆసియాలోనే అతిపెద్ద ఓపెన్ ఎయిర్ ట్రేడ్ గా ప్రసిద్ధి చెందింది. కార్తీక పూర్ణిమ సమయంలో మహానది నుండి బోయిటాస్ అనే పడవలలో వ్యాపారులు సుదూర ప్రాంతాలకు ప్రయాణించే ఒడిషా సంప్రదాయానికి ప్రతీకగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ పండుగ ఒడిశా రాష్ట్ర గొప్ప వారసత్వాన్ని, స్మృతులను తెలియజేస్తూ.. సందర్శకులకు చక్కని అనుభూతినిస్తుంది. ఈ జాతర ఈ నెల 22వ తేదీ వరకు జరగనుంది. ఈ జాతరకు వచ్చే భక్తుల కోసం పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి - అక్టోబర్ వరకు భారత్ ఎగుమతులలో మంచి పనితీరు కనబరిచిందని కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ వెల్లడించింది. ఈ నిడివిలో మొత్తం 468.27 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగి, 7.28 శాతం పెరుగుదల నమోదయింది. కాగా... 2023 సంవత్సరంలో ఇదే సమయంలో 436.48 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయని పేర్కొంది. కేవలం సరుకుల ఎగుమతులు 252.28 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే కాలంలో 244.51 బిలియన్ డాలర్ల ఎగుమతులతో పోలిస్తే 3.18 శాతం వృద్ధి నమోదయింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =